# అబలలా?

శ్రీమతి అంగర వెంకటకృష్ణారావుగారు

అలాంటి వర్షము ఎన్నడూ కురియలేదు. ఘోరుమంటూ ఏకాధ్వరంగా ఇరవై ఎనిమిది గంటలు పడింది. పెనుగాలివల్ల వేళ్లతో కూడా ఊడొచ్చి పెద్దవృక్షాలు పొంగి పారుతూన్న నదీనదాలవల్ల కొట్టుకొనిపో బడుతున్నాయి. మనుష్యసంచారం లేదు. చీమచిటుక్కుమంటే వినబడేటంత నిశ్శబ్దంగా ఉంది నిశీధము. చీకటి పట్టంగాఉంది. నక్షత్రాలైనా లేకపోవడంవల్ల దగ్గరగా ఉన్న వస్తువులే అగుపడడంలేదు. అప్పుడప్పుడు మెరుపులు తళుక్కుమంటే పరిసర వస్తుసమితి స్పష్టంగా కానవస్తూంది. మొత్తానికి ప్రకృతి మూర్తీభవించిన మృత్యుదేవతలాఉంది.

అలాంటిసమయంలో తన వాడుకప్రకారం సీతి, పల్లెకుపోతూంది. సీతి ఒక హరిజనయువతి. తన పల్లెనుంచి రోజూ పట్నంవెళ్లి అక్కడ భిక్షమెత్తుకొని రాత్రి ఏడెనిమిది గంటలయేసరికి యిల్లు చేరుకుంటుంది. సీతికి భర్త లేడు. చనిపోయాడు. ఇద్దరు మొగపిల్లలూ, ఒక ఆడపిల్ల ఉన్నారు. పిల్లలు చిన్నవాళ్లవడంచేత వాళ్లనిపోషించడం బాధ్యత సీతిదే. ఇళ్లలో కూలి చేసి ఎక్కువగా డబ్బు సంపాదిద్దామంటే; హరిజనయువతి అయిపోవడంవల్ల దగ్గిరకి రావడానికి వల్లకాదు. మైల! మైల!

అంత భయంకరసమయంలోకూడా, పిల్లలపై ప్రేమచేత సీతి పట్నానికి బయలుదేరింది. అప్పునుమరి. తను బయలుదేరకపోతే ఇంటిదగ్గర పిల్లలదారి? వారికి రాత్రి తిండి ఎలావస్తుంది. అప్పుడే ఎనిమిది అయిపోయింది. వెళ్లాలి. దొరికిన నాలుగు గింజలు ఉడకెయ్యాలి. పాపం ఇంటికెళ్లగానే పిల్లలందరూ ఎంతో ఆతురతతో చుట్టూ మూగుతారు అమ్మ ఏమిటో తెచ్చిందని. అందుచేతే బయులుదేరింది ఇంటికి ఆ భయంకరసమయంలో.

సీతి వెళ్లేదారిలో ఒక వంతెనఉంది. అది రైలువంతెన. రోజూ సీతి ఆవంతెన దాటి తన పల్లెకిపోవాలి. నడచినడచి ఆ నాడు వంతెన చేరుకుంది. నాడు వంతెన మించి నీరు జోరుగా పారుతోంది. పాపం ఎలా వెళుతుంది. అలా నిలిచిపోయింది అతిదీనంగా నీటివైపు చూస్తూ పిల్లల్ని తలుచుకుంటూ.

వర్షం ఆగకుండా కురుస్తోంది. గాలి 'ఘోరు'మని వీస్తోంది. వారధిమించి నీరు జోరుగా పారుతూంది. సీతి హృద్వాహిని ఇంటివేపు పరువెడుతోంది. లెక్కలేనన్ని తలంపులు ఉద్భవిస్తున్నాయి. ఏమిచేయడం?

పరాకుగా నిలుచున్న సీతికి గుభిల్లని శబ్దం వినబడింది. సీతిగుండెలు 'పటాలు'న పగిలిపోయినట్లయేయి. వంతెన కూలిపోయింది. మరి ఇల్లు చేరుకోవడం కల్లో వార్త. హృదయం బరువెక్కిపోతూంది. పిల్లలు ఏమి ఇబ్బంది పడుతున్నారో? ఎంత

ఏడుస్తున్నారో?

హఠాత్తుగా వెనకతట్టునుండి 'ఝుం' మని శబ్దం వినబడింది సీతికి. వెనక తిరిగి చూసింది. పేసింజరుబండి. అతివేగంగా వస్తూంది. దానినిండా జనం క్రిక్కిరిసి ఉన్నారు. ఎంతో దూరంలో లేదుకూడాను. తప్పక అతిత్వరలోనే వస్తుంది. వంతెన దాటుతుంది. జీవకోటితోసహా గంగపాలౌతుంది. ఏమి చెయ్యడం? అన్ని ఆలోచనలూ సీతికి ఒక్కలిప్తలో తట్టినవి. ఎంత తెలివైన వ్యక్తి! ఎంత భూతదయ!

అన్నిప్రాణాల్ని రక్షించడానికి సీత తన ప్రాణమైనా పోగొట్టుకో నిశ్చయించింది. ఆ సాహసం! ఆ తెగింపు! ఆ భూతదయ! ఎవరికుంటాయి? కులము తక్కువైతేనేమి? పిల్లల్ని ఒక్కసారి తలచుకుంది. ప్రాణములపై తీపివిడచింది. పోయిన భర్తని తన మనసార తలచుకుంది. అమాయకమై నిష్కల్మషమైన హృదయంతో దైవాన్ని ప్రార్థించింది. ఇటుఅటు వెఱ్ఱిగాచూసింది. ఏమి తోచలేదు. అట్టె ఆలస్యమైతే ఎన్ని ప్రాణాలు ఒక్కసారిగా మృత్యుగహ్వరాన్ని బడిపోతాయి. ఏమి చెయ్యడం? సీతికి పిచ్చెత్తినట్లయింది. ముందు వెనుక లాలోచించకుండా పరుగెత్తడం ప్రారంభించింది. మహాశక్తిలాగ విజృంభించి రైలుపట్టాల మధ్యనుంచి రాయనక, రప్పనక కోలయమునిలా వచ్చే ఆ రైలుకెదురుగా పరుగెత్తడం ప్రారంభించింది. ఎంత విచిత్రము! నొప్పి! బాధ, పిల్లలు, తాను, ప్రపంచం ...... ఒకటేమిటి? అన్ని మరచిపోయింది. రైలునాపి ప్రజలని రక్షించడానికే తాను జన్మించినట్టుగా భావించింది. 'వంతెన పడిపోయింది. వారధి విరిగిపోయింది. రైలు ఆపండి' అంటూ అరవడం మొదలెట్టింది. వినిపిస్తుందా? ఘుణఘుణా శబ్దంలో కోకిల కూతని ధిక్కరించే ఆసీతి ఎలుగు వినిపిస్తుందా? అసలు రైలుకూతలోనే మనిషికూత వినపడదు. అందుకు తోడుగాలి హోరుమంటూంది. క్రమంగా ఒకరిద్దరై పోకరు వస్తున్నారు. ఉక్కుగుఱ్ఱంలాగ వస్తున్నది రైలు. వచ్చి వచ్చి పెఢిల్లని రైలు సీతిని ఢీకొన్నది. మరుక్షణంలో సీతి అగుపడలేదు. 'ఇన్ని ప్రాణాల్ని రక్షించేను. ఇక నాకు స్వర్గమే' అని చెప్తున్నాదనట్లు అంతరిక్షాని కెగిరిపోయింది. కాని రైలు జనంతోకూడ రక్షింపబడ్డాది! ఎవరివల్ల? ఒక్క అబలవల్ల!!! ఎంత తెగింపు! మృత్యుదేవతలా నోరు తెరచుకున్న ఆ వారధిలేని లోయకు ఇరువదియడుగుల దూరమున రైలు ఆగింది. ఆ ప్రజలసంతోషం! రైలును రక్షించిన వారిని చాలా స్తుతించేరు. ఏమి లాభం? విన సహ్యముకాని పిల్లలగోల! పాపము సీతి పిల్లలు! ఎంత ఏడిస్తే నేమిలాభం? పిల్లల విషయమై వేడెక్కి ఉన్న సీతి ఒళ్లు, రక్తం చేత శాంతిపరచబడ్డది.

స్త్రీలు! అబలలా? కాదు కాదు. పోనీయండి.. అబలలైనప్పుడే ఇంతటి ఘనకార్యాలు చేయగల్గితే సబలలైనప్పుడు ఇంకెంతటి పనులు చేయగలరో! ఈపాటికి భారతీయులకి స్వరాజ్యం వచ్చేయుండేది!